క్లుప్తంగా

పెద్దవాగు సందర్శన



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

మందమర్రిరూరల్: మండలంలోని అందుగులపేట శివారులోని పెద్దవాగును మంగళవారం తహసీల్దార్ సతీశ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ కుమార్‌దీపక్ సందర్శించారు. వర్షానికి దెబ్బతిన్న కల్వర్టుకు మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాకాలం వాగు దాటి వెళ్లాల్సి వచ్చినప్పుడు జాగ్రత్తలు, సూచనలు పాటించాలన్నారు. కలెక్టర్ ఆఫీస్‌లో తక్షణ సాయం అందించేందుకు 08736-250501 నంబర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లోతట్టు వరదప్రాంత బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు, 90మంది సభ్యులతో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

నేడు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద గల 95ఎంఎల్‌డీ మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం నుంచి విడుదల చేసే మంచినీటి సరఫరా బుధవారం నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ డివిజన్ అధికారి మధుసూదన్ తెలిపారు. శుద్ధి కేంద్రంలో పూర్తిస్థాయి మరమ్మతుల కారణంగా నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్, మందమర్రి, జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి మండలాలతో పాటు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, లక్సెట్టిపేట, చెన్నూర్, క్యాతనపల్లి, మందమర్రి మున్సిపాలిటీలకు మంచినీటి సరఫరా జరగదని తెలిపారు.

వరద తగ్గుముఖం



మంచిర్యాలటౌన్: వర్షం తగ్గుముఖం పట్టడంతో మంచిర్యాల నగరంలోని రాళ్లవాగు వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. కాజ్‌వే పై నుంచి ఉరకలెత్తిన వరద నీరు మంగళవారం కాజ్‌వే తేలేలా వరద ప్రవహించింది. రాళ్లవాగు సమీపంలోని కాలనీ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లను ఎత్తి వరద నీటిని గోదావరి నదిలోకి వదిలేస్తుండగా, నగరంలోని పుష్కరఘాట్ల మెట్ల వరకు వరద నీరు చేరడంతో, నగర ప్రజలు గోదావరి ప్రవాహాన్ని చూసేందుకు తరలివచ్చారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

మంచిర్యాలఅర్బన్: మానవ అక్రమ రవాణా నిర్మూలించటం అందరి బాధ్యత అని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ చంద్రయ్య అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలి సంస్థ, ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో టీచర్లకు రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణను ప్రారంభించారు. శిక్షణలో మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం ఎలా జరుగుతుంది.. ? బాధితురాలిపై ఉండే ప్రభావాలు, సైబర్ ఆధారిత అక్రమ రవాణా, చట్టాలు తదితర విషయాలపై వివరించారు. కార్యక్రమంలో క్వాలిటీ కో-ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, రిసోర్సు పర్సన్, స్కూల్ అసిస్టెంట్ టీచర్లు పాల్గొన్నారు.

మందులు ఉచితంగా అందించాలని వినతి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ద్వారా జిల్లాలో సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు 400మందికి ఉచితంగా మందులు అందించేలా చూడాలని కోరుతూ తలసేమియా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ మంగళవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీమన్నారాయణకు వినతిపత్రం అందించారు. జిల్లాలోని ఆశావర్కర్ల ద్వారా గ్రామాల్లో ఉంటున్న సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా మందులు అందేలా చూడాలని కోరారు. సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు బీసీ రాజ్యాధికార సభ

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్‌లో(నేడు) బుధవారం ఉదయం 11గంటలకు బీసీ రాజ్యాధికార సభ నిర్వహిస్తున్నట్లు, బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా ఇన్‌చార్జి మహేశ్ వర్మ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సుధగాని హరిశంకర్ గౌడ్, బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలోని బీసీలు, మేధావులు, నాయకులు, మహిళలు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

ఒర్రె ఉప్పొంగడంతో రోటిగూడకు నిలిచిన రాకపోకలు



నిలిచిన రాకపోకలు

- ఉప్పొంగి ప్రవహిస్తున్న ఒర్రెలు, వాగులు
- ఇబ్బంది పడుతున్న మూడు గ్రామాల ప్రజలు

జన్నారం: భారీ వర్షాల కారణంగా మండలంలోని మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రోటిగూడకు వెళ్లే దారిలో ఒర్రె ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో రోటిగూడ వాసులు జన్నారం వైపు రాలేకపోయారు. లోత్‌ఒర్రె గిరిజన గ్రామానికి మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసరంగా జన్నారానికి వెళ్లాల్సి ఉండగా గ్రామస్తులు బైక్‌కు తాడు కట్టి దాటించారు. వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో లక్ష్మీపూర్ తాండా, గొండుగూడకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆ వాగులపై వంతెనలు కట్టాల్సి ఉండగా అధికారులు దృష్టి సారించడం లేదు. ఇటీవల ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పర్యటనలో భాగంగా రోటిగూడ ఒర్రెపై వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చారు. అడవిని ఆనుకొని ఉన్న మారుమూల గిరిజన గ్రామమైన లోత్‌ఒర్రెకు వెళ్లేందుకు వాగుపై వంతెన నిర్మాణం అత్యవసరమని, ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అత్యవసరం ఉంటే ఇబ్బందే



జ్వరాలు, ఇతర రోగాల భారిన పడి అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాలంటే చాలా ఇబ్బంది అవుతుంది. వాగులు తగ్గేవరకు వేచి చేయాల్సిందే. సొంత పనుల కోసం ఎటు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మా సమస్యను ఎవ్వరు పట్టించుకుంట లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– పూసం సంపత్, లోత్‌ఒర్రె

వర్షాకాలంలో బడికి వెళ్లడం బందే..



వానాకాలంలో ప్రధాన రోడ్డు నుంచి మా గ్రామానికి వెళ్లాలంటే ఇబ్బంది అవుతుంది. ఎప్పుడు ఒర్రె పొంగుతుందో తెలియదు. జన్నారం వెళ్లిన వారు ఒర్రె ఉధృతి తగ్గేవరకు రోడ్డుపైనే ఆగాలి. వర్షకాలంలో మా ఊరి పిల్లలు బడికి బందు కావాల్సిన పరిస్థితి ఉంటుంది. అధికారులు స్పందించి ఒర్రె పై వంతెన నిర్మించాలి.

ఉప్ప శ్రీనివాస్, రోటిగూడ

కాజ్ వే కూలింది.. దూరం పెరిగింది



అక్కెపల్లి వాగుపై కూలిన కాజ్‌వే

- చెన్నూర్ నుంచి అక్కెపల్లి రావడానికి మూడు కి.మీ దూరభారం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ మండలంలోని అక్కెపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలోని వాగుపై ఉన్న కాజ్‌వే ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా కూలిపోయింది. దీంతో ఆ గ్రామ ప్రజలు జాతీయ రహదారి మీదుగా మూడు కిలో మీటర్లు అదనంగా తిరిగి గ్రామానికి రావాల్సి వస్తుంది.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు..

ఏడు నెలల క్రితం శివలింగాపూర్ మీదుగా అక్కెపల్లి గ్రామం నుంచి జాతీయ రహదారి వరకు నూతనంగా బీటీ రోడ్డు నిర్మించారు. అయినా లాభం లేకుండా పోయింది. అక్కెపల్లి వాగుపై కాజ్‌వే పూర్తిగా కూలిపోవడంతో వాహనాల రాకపోకలు బందు అయ్యాయి. ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా పోలీసులు రెండు వైపులా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి దారిని మూసి వేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకొని వాగుపై వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



శివలింగాపూర్ రోడ్డు మూసివేసిన పోలీసులు

పాలగోరి గిరిజనులకు అధికారుల కౌన్సెలింగ్

- ప్రాంతాన్ని ఖాళీ చేయాలని సూచన

జన్నారం: 20రోజులుగా ఇందన్‌పల్లి అటవీరేంజ్ కవ్వాల్ సెక్షన్ సోనాపూర్ తాండా బీట్‌లోని పాల ఘోరీల ప్రాంతంలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న గిరిజనులకు మంగళవారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమర్‌షరీఫ్, రేంజ్ అధికారి శ్రీధరచారి, డీటీ రామ్మోహన్లు కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్టపరిధిని దాటి ఈ ప్రాంతంలో ఉండకూడదన్నారు. ప్రాంతం పూర్తిగా అటవీభూమిలో ఉందని తెలిపారు. చట్టప్రకారం ఈ ప్రాంతం నుంచి వెళ్లిపోవాలని సూచించారు. ఏదైనా ఉంటే కాగితాలతో వస్తే చట్టప్రకారం న్యాయం జరుగుతుందని సూచించారు. వర్షాలు ఎక్కువగా పడుతున్నందున చలిలో, ఇబ్బందులు పడుతూ ఇక్కడ ఉండటం మంచిదికాదని సూచించారు. అయితే అక్కడి నుంచి వెళ్లేది లేదని గిరిజనులు భీష్మించుకొని కూర్చున్నారు. న్యాయం జరిగేవరకు కదిలేది లేదని అధికారులతో తెలిపారు.



గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

ఫొటోగ్రఫీ అద్భుత ఆవిష్కృతం

- ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

బెల్లంపల్లిరూరల్: ఫొటోగ్రఫీ అద్భుత ఆవిష్కృతమని ఏసీపీ ఏ.రవికుమార్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫొటోగ్రాఫర్లు తిలక్ స్టేడియం నుంచి కాంటా అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. డాగురే చిత్రపటానికి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఏసీపీ మాట్లాడుతూ.. పాత జ్ఞాపకాలకు సజీవ సాక్ష్యంగా ఫొటోగ్రఫీ నిలుస్తుందని పేర్కొన్నారు.

రామకృష్ణాపూర్/భీమిని/నెన్నెల/చెన్నూర్/జన్నారం/శ్రీరాంపూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం, శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, జన్నారం, నెన్నెల, భీమిని మండలాల్లో, చెన్నూర్ పట్టణంలో వేడుకలు నిర్వహించారు. ఫొటోగ్రఫీ పితామహుడు డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. పలువురు ఫొటో గ్రాఫర్లను ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు. ఫొటో, వీడియోగ్రాఫర్స్ పాల్గొన్నారు.



బెల్లంపల్లిరూరల్: నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

కోటపల్లి/చెన్నూర్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 25న నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం పోస్టర్లను చెన్నూర్‌లో సీఐ దేవేందర్‌రావు, కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ బన్సీలాల్ లయన్స్‌క్లబ్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్యామ్ పటేల్, సుబ్బారావు, తిరుపతి, వెంకటేశ్వర్లు, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఆండాళమ్మ కాలనీలో పాతమంచిర్యాల అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వంద మందికి పైగా స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు.

సీహెచ్‌పీలో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశం

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సీహెచ్‌పీలో మంగళవారం మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఇన్‌చార్జి జీఎం విజయ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలు సాధించేందుకు ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. డీజీఎంలు బాలాజీ భగవతి, ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఐఈడీ కిరణ్‌కుమార్ ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి అక్బర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ప్రగతి మైదానాన్ని పరిశీలించిన జీఎం

శ్రీరాంపూర్: ఈ నెల 30న నిర్వహించే 55వ వార్షిక రక్షణ బహుమతులు ప్రదానోత్సవం కార్యక్రమం జరిగే ప్రగతి మైదానాన్ని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ పరిశీలించారు. మంగళవారం ఆయన ఏరియా ముఖ్య అధికారులతో కలిసి ఈ కార్యక్రమానికి మైదానంలో చేయాల్సిన ఏర్పాట్లను సూచించారు. ఏర్పాట్లు పగడ్బందీగా ఉండాలన్నారు. వర్షం వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ సాంబశివరావు, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, రవికుమార్, ఏరియా రక్షణాధికారి విజయ్‌కుమార్, డీజీఎంలు ఆనంద్‌కుమార్, రవీందర్, హరినారాయణ, క్వాలిటీ ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ పీఓ కాంతారావులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్

■ బొగ్గుబాయి వార్తలు

డైరెక్టర్‌కు సన్మానం



సన్మానిస్తున్న జీఎం శ్రీనివాస్

రామకృష్ణాపూర్/శ్రీరాంపూర్: ఈ నెలాఖరుతో రిటైర్డ్ అవుతున్న డైరెక్టర్(ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు దంపతులను అధికారులు ఘనంగా సన్మానించారు. శ్రీరాంపూర్ ఏరియా స్టోర్స్, సీహెచ్‌పీలో, రామకృష్ణాపూర్ అలివేలు మంగ సమేత వేంకటేశ్వర ఆలయంలో మంగళవారం సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమాల్లో శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, డైరెక్టర్ సతీమణి హరిణి, శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు ఉమారాణి, డీజీఎంలు మల్లయ్య, ఎస్ఈ చంద్రలింగం, అధికారులు రాజేశ్వర్‌రావు, శేఖర్, ఏఐటీయూసీ నాయకులు బద్రి బుచ్చయ్య, కుమారస్వామి, సల్ల తిరుపతి, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా జరుపుకోవాలి

మంచిర్యాలఅర్బన్/బెల్లంపల్లిరూరల్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాసరావు, మంచిర్యాల అగ్నిమాపక అధికారి సత్యనారాయణ, హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ సూచించారు. మండపాల్లో భద్రత, బందోబస్తు అనుమతుల కోసం తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో అనుమతులు తీసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లై చేసిన తర్వాత అనుమతి లభిస్తుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నవరాత్రులను నిర్వహించుకోవాలని సూచించారు. రక్షణ చర్యలు పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు పాటించాలన్నారు. పోలీసు శాఖ వారికి సహకరించి పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

ముగిసిన మండల ప్రజావేదిక

వేమనపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 15వ మండల సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం కొనసాగింది. 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025మార్చి 31వరకు సుమారు రూ.4కోట్ల ఉపాధిహామీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్‌డీవో కిషన్, విజిలెన్స్ అధికారి కిరణ్ ఆధ్వర్యంలో 14 గ్రామపంచాయతీల నివేదికలను చదివి వినిపించారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్‌లో తప్పిదాలు ఉండగా పలువురికి రికవరీకి ఆదేశించారు. పలు గ్రామపంచాయతీల్లో నేమ్ బోర్డు, కంపోస్ట్ ఫిట్ లేకపోవడంతో వర్క్ రికవరీ విధించారు. 20నుంచి 30శాతం మొక్కలు చనిపోయి ఉండటంతో రిప్లేస్‌మెంట్ విధించారు. మస్టర్లలో ఎక్కువ అటెండెన్స్ ఉండటం, ఏపీవో, ఎంపీడీవో సంతకాలు లేకుండా అక్కడక్కడ కూలీలకు చెల్లించడం సామాజిక బృందం గుర్తించింది. కూలీల సంతకాలు లేకుండా మస్టర్లు పొందుపర్చడం, ఒకే కుటుంబంలో రెండేసి జాబ్ కార్డులు ఉన్నట్లు గుర్తించారు. చామనపల్లిలో అవకతవకలకు బాధ్యులను చేస్తూ సిబ్బందికి రూ.వెయ్యి రికవరీ, క్యాతన్‌పల్లిలో రూ.635, వేమనపల్లిలో రూ.736, ముల్కలపేట రూ.5,757, దస్నాపూర్ రూ.428, నాగారాంలో రూ.232 రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ రవికుమార్, ఎంపీడీవో కుమారస్వామి, ఏపీవోలు మహేశ్వర్‌రెడ్డి, సత్యప్రసాద్, ఈజీ మధుకర్, పీఆర్‌ఏఈ ప్రదీప్‌కుమార్, టీఏలు, కార్యదర్శులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు




తెగిన కల్వర్టు.. తప్పని కష్టాలు

వేమనపల్లి: మండలంలోని చామనపల్లి గ్రామ పంచాయతీ బొమ్మెన గ్రామస్తుల కష్టాలు వర్ణనాతీతం. భారీ వర్షాల కారణంగా కల్వర్టు కొట్టుకుపోవడంతో ఆ గ్రామపంచాయతీకి రాకపోకల కష్టాలు ఎక్కువయ్యాయి. గొలికుంట ఒర్రె వరదతో కల్వర్టు కొట్టుకుపోవడంతో గ్రామానికి కనీసం బైక్‌లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మంగళవారం ఓ కుటుంబం నిత్యావసర సరుకులు వేమనపల్లి నుంచి ఆటోలో తీసుకొచ్చుకొని, నలుగురు వ్యక్తులు సామగ్రిని అవతలికి తరలించి ఎడ్లబండి సాయంతో రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న బొమ్మెనకు తరలించారు.

అటెన్షన్ ప్లీజ్..

పొంచిఉన్న ప్రమాదం



మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం ప్రహరీకి ప్రమాదం పొంచి ఉంది. వర్షాలకు ప్రహరీ కింది భాగం సగం వరకు కూలిపోయింది. అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని ఎటువంటి ప్రమాదం జరగక ముందే మరమ్మతు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అటవీ శాఖ అధికారి

ఫోన్ నంబర్ : 94408 10100



నిలిచిన నీరు.. విద్యార్థుల ఇబ్బందులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక గాంధీనగర్ సినిమావాడ పాఠశాలలో 170పైగా మంది విద్యనభ్యసిస్తుండగా, పాఠశాల ఆవరణలో ఉన్న ప్రైమరీ స్కూల్లో 90పైగా విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలకు వెళ్లాలంటే విద్యార్థులు అష్టాకష్టాలు పడాల్సి వస్తుంది. వర్షం పడితే చాలు రహదారిపై నీరు ప్రవహించటం.. బురదమయంగా మారి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బడికి రెండు వైపుల దారులున్నా కష్టాలు తప్పటం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

ఆకట్టుకున్న టీఎల్‌ఎం మేళా

నెన్నెల/జైపూర్: జైపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, నెన్నెల మండలం ఆవుడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన టీఎల్‌ఎం మేళాలు ఆకట్టుకున్నాయి. జైపూర్‌లో జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి, ఎంఈవో శ్రీనివాస్, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్సై శ్రీధర్ మేళాను ప్రారంభించారు. నెన్నెలలో ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం చంద్రశేఖర్, ఆవుడం హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, డీఆర్పీ ఖాదర్ తదితరులు హాజరయ్యారు.

22న మెగా రక్తదాన శిబిరం

మంచిర్యాలటౌన్: మెగాస్టార్ చిరంజీవి జన్మదినంను పురస్కరించుకొని ఈ నెల 22న మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో మెగా రక్తదాన శిబిరాన్ని ఉదయం 9గంటలకు నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఈ నెల 24న వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి దేవరాజ్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ కార్యవర్గం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండల, పట్టణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా అక్కెనపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా జన్నం సత్యనారాయణ, కోశాధికారిగా శ్రీ రామోజు లక్ష్మణాచారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం...

పాతమంచిర్యాల: నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికలు మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. జిల్లా యువజన అధ్యక్షుడిగా అయిరిపెల్లి సత్యం, ప్రధాన కార్యదర్శిగా కుర్మిళ్ల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పక్కా భవనాలు నిర్మించాలి

మందమర్రిరూరల్: జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు యాత్ర మంగళవారం మందమర్రికి చేరింది. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.